ప్రజాశక్తి
ఆదివారం 19 అక్టోబర్ 2025

అంగన్‌వాడీల సేవలు మరింత మెరుగుపడాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో అంగన్వాడీల సేవలు మరింత మెరుగుపడాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని రెల్లలో కొత్తగా మంజూరైన అంగన్వాడి భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. నూతన భవన నిర్మాణ పనులతో చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యా బోధన జరిగేందుకు వీలుంటుందన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం (అక్టోబర్ 11) సందర్భంగా నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి కనకదుర్గ, సిడిపిఒ విజయ గౌరి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, ఎంపిడిఒ శ్రీనివాసరావు, డిఇ శ్రీనివాస్, కూటమి నాయకులు, ఐసిడిఎస్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో కూరగాయలను పరిశీలిస్తున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ : జెసి

ప్రజాశక్తి - పాచిపెంట

పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఆదేశించారు. పిల్లలకు ఆరోగ్యం బాగాలేకపోతే వారు ఆరోగ్యవంతులుగా తిరిగి వచ్చేంత వరకు ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. మండలంలోని పి.కోనవలసలోని ఎపి గిరిజన సంక్షేమ బాలుర వసతి పాఠశాలను, బాలికల జూనియర్ కళాశాలను జెసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లు, వంటగది, ఆహారం, ఆర్ఒ ప్లాంట్ తదితర ప్రదేశాలను నిశితంగా పరిశీలించిన ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీచేశారు. అక్కడి విద్యార్థులతో ముచ్చటించి వివరాలు అడిగి తెలుసుకున్న జెసి వసతి గృహంలో ఉండే సదుపాయాల పట్ల ఆరా తీశారు. పిల్లలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని అన్నారు. నాణ్యమైన ఆహారంతో పాటు విద్యను అభ్యసించేలా చూడాలని అన్నారు. వంటగది పరిసరాలు కూడా బాగుండాలని, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని అన్నారు. స్వచ్ఛమైన నీటిని అందించాలని, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఆర్.ఓ ప్లాంటు వద్ద ఎటువంటి అపరిశుభ్రత లేకుండా చూడాలని సూచించారు. అనంతరం సాలూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి, విద్యార్థుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. పిల్లలు త్వరగా కోలుకొని వసతి గృహాలకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని హితవు పలికారు. ఈ సందర్శనలో సంక్షేమ అధికారులు, ప్రధాన ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పిచ్చిమొక్కల తొలగింపు

వీరఘట్టం : వీరఘట్టం– పాలకొండ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను శనివారం ఆర్అండ్‌బి అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు తొలగించారు. రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను బ్లేడు ట్రాక్టర్‌తో తొలగించారు. ఈ మొక్కల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం మొక్కల తొలగింపుతో ఊపిరి పీల్చుకున్నారు.

'ఉపాధి'ని పకడ్బందీగా అమలు చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి - పాలకొండ

ఉపాధిహామీ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని ఓని గ్రామంలో 274, 256/2 సర్వే నంబర్లు ప్రభుత్వ భూములు నిబంధనలు విరుద్ధంగా కొంతమంది పెద్దల పేరుపై ఉందని, దీనిపై దర్యాప్తు చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు పార్వతీపురంలో జరుగుతున్న నేపథ్యంలో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని శనివారం పోస్టర్ విడుదల చేశారు. అనంతరం గంగునాయుడు మాట్లాడుతూ జిల్లాలో గిరిజనులు, పేదల సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం నిరంతరం పోరాడుతుందన్నారు. పేదలు సాగు చేస్తున్న భూములకు డి పట్టాలివ్వాలని, ప్రభుత్వమే ఉచిత విద్య, వైద్యం అందించి, షరతులను సడలించి అన్ని రకాల సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాలు, వామపక్ష రాజకీయ పార్టీల పోరాట ఫలితాలతో వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం ఎత్తివేయడానికి ప్రయత్నం చేస్తుందని, అందులో భాగంగానే రెండు పూటల పని విధానాన్ని ప్రవేశపెట్టిందని, దీనిని వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగాఖండిస్తుందని అన్నారు. పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీళ్లు, మజ్జిగ, పనిముట్లతో పాటు అత్యవసర ఆరోగ్య కిట్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టానికి రక్షణగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నిలుస్తుందన్నారు. గిరిజనుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యవసాయ కార్మిక సంఘం వ్యతిరేకిస్తుందన్నారు. జిల్లాలో జరుగుతున్న అనేక ప్రజా పోరాటాలకు మద్దతునిస్తున్న నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం గత మూడేళ్లలో చేసిన కృషిని సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలు, కార్యక్రమాల రూపుమాపడానికి, అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు పోరాటానికి సిద్ధం కావాలని, ఆ దిశగా పదో జిల్లా మహాసభలు ఈనెల 22న పార్వతీపురంలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభల జయప్రదానికి వ్యవసాయ కార్మికులు, రైతులు, మేధావులు, అభ్యుదయవాదులు ఆర్థిక, హార్దిక సహకారంతో జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కమిటీ సభ్యులు దూసి దుర్గారావు, సింహాచలం, జె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి గంగునాయుడు, నాయకులు

ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని సారిక, గంజాయభద్ర పంచాయతీల పరిధిలో గల 25 గ్రామాల్లోని లబ్ధిదారుల ఇళ్లకు విఆర్ఒలు వెళ్లి రేషన్ స్మార్ట్ కార్డులను శనివారం అందజేసినట్టు తహశీల్దార్ నీలకంఠరావు తెలిపారు. ఈనెలల 14న స్మార్ట్ కార్డుల కోసం గిరిజనులు మండలంలోని సారిక సచివాలయం వద్ద నిరీక్షించారు. ఎప్పటికీ సిబ్బంది సచివాలయానికి రాకపోవడంతో నిరాశతో వారు వెనుదిగారు. ఈ విషయమై ప్రజాశక్తిలో ప్రచురితమైన 'ఎప్పుడొస్తారో... ఎవరికెరుక..' కథనం ప్రచురించింది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సమాచార లోపంతోనే సచివాలయం వద్ద స్మార్ట్ కార్డులను ఇవ్వలేక పోయామనితెలిపారు. ఈ స్మార్ట్ కార్డులను అందించేందుకు లబ్ధిదారుడు ఫేషియల్ ఐడెంటిపై ఆన్లైన్‌లో నమోదు చేయాలని, దీంతోనే సమయం పడుతుందని అన్నారు. ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది లబ్ధిదారులు ఇళ్లకు వెళ్లి 1016 స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారని, మిగతా 128 కార్డులను అందజేస్తామని ఆయన తెలిపారు.

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

విద్యార్థుల మరణాలపై వైసిపిది తప్పుడు ప్రచారం

గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు

జిల్లాలో ఇటీవల ఆశ్రమ, గురుకుల పాఠశాలల విద్యార్థులు అనారోగ్యానికి గురైన ఘటనపై వైసిపి నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని రాష్ట్ర గిరిజన , స్త్రీ, శిశుసంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి హితవు పలికారు. మంత్రి తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో శనివారం మాట్లాడారు. ఇద్దరు విద్యార్థులు చనిపోతే 11 మంది అని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై రాజకీయాలు చేయకండని, సీజనల్ వ్యాధులు నియంత్రించడానికి, ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో శానిటేషన్ మెరుగుకు ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలని, విమర్శల కంటే సలహాలు తమకు అవసరమని ఆమె అన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో 118 మంది విద్యార్థులు మరణిస్తే వైసిపి నేతలు ఒక్క కుటుంబాన్నైనా పరామర్శించారా? మీరు ఏం చేశారు? ఏ హాస్పిటల్‌కి వెళ్లారు? ఎన్ని పాఠశాలలను పరిశీలించారని మాజీ గిరిజన శాఖ మంత్రులు, మాజీ ఉప ముఖ్యమంత్రులు పుష్పశ్రీవాణి, రాజన్న దొరను మంత్రి ప్రశ్నించారు. ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ఇటీవల రూ.112 కోట్లు విడుదల చేసిందన్నారు. ఈ నిధులను పాఠశాల భవనాలు, బాత్‌రూములు, కిచెన్, బెడ్‌రూమ్ ఫెసిలిటీస్‌కు వినియోగించనున్నామని తెలిపారు. విశాఖకు గూగుల్ రాకతో ప్రపంచం హర్షిస్తుంటే వైసిపి నేతలు మాత్రం గోగ్గోలు పెడుతున్నారన్నారు. మెడికల్ కాలేజీలు కట్టకుండానే వాటి దగ్గర ధర్నాలు చేయడం హాస్యాస్పదమన్నారు. పార్వతీపురంలో స్థల సేకరణ కూడా చేయకుండానే తాము కాలేజీ కట్టామంటున్నారని, ఇది సిగ్గు లేనితనం కాదా? మతిస్థిమితం లేని పనులు కాదా?" అని మంత్రి ప్రశ్నించారు. ప్రజలకు వాస్తవాలు తెలుసునని, తప్పుడు ప్రచారాలతో, అబద్ధాలతో ప్రజల మద్దతు సంపాదించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ మంత్రి సంధ్యారాణికి ఫోన్ చేసి ఆరా తీశారు. తక్షణ చర్యలు తీసుకోవాలని తీసుకున్న మంత్రిని ఆయన ప్రశంసించారు. విలేకరుల సమావేశంలో సాలూరు పట్టణ, మండల మెంటాడ, పాచిపెంట, మక్కువ మండలాల టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, చలుమూరి వెంకట్రావు, గూడెపు యుగంధర్, గుల్ల వేణుగోపాలరావు, కౌన్సిలర్లు వైదేహి, వరలక్ష్మి, బందాపు సీతమ్మ, హర్షవర్ధన్, కొనిసి చిన్ని, అక్యాన అప్పారావు, మత్స శ్యాం, కోట లక్ష్మణరావు ఉన్నారు.

జ్యువెలరీ షాపు యజమాని మోసం

బాధితుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో గల ఓ బంగారం షాపు యజమాని మోసానికి గురైన ఓ బాధిత కుటుంబం శనివారం అదే షాపు ముందు ఆందోళనకు దిగింది. కుటుంబ యజమాని పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించాడు. తాను తాకట్టు పెట్టిన బంగారం ఇవ్వాలని, న్యాయం చేయాలని కోరుతూ పట్టణంలోని రామాపురం కాలనీకి చెందిన కోట విజయ్ శనివారం పట్టణ ప్రధాన రహదారి పక్కన ఉన్న శ్రీ స్వామి జ్యుయలర్ షాపులోకి వెళ్లి పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించారు. ఆయన భార్య శ్రీదేవి, కుమార్తె సాయి రూప కుటుంబ సభ్యులు గేట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితుడు విజయ్ మాట్లాడుతూ తన అవసరాల నిమిత్తం 2019లో శ్రీ స్వామి జ్యుయలర్ యజమాని గెంబలి శంకర్రావు వద్ద 30 తులాల బంగారాన్ని తాకట్టు పెట్టానని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా సకాలంలో విడిపించలేకపోయానని చెప్పారు. ఇంతలో షాపు యజమాని గెంబలి శంకర్రావు కరోనా మహమ్మారితో అకస్మాత్తుగా మృతి చెందాడని, ఆయన కుమారులైన పృధ్వీ విజయ్ కుమార్, కుటుంబ సభ్యులకు బంగారం తాకట్టు పెట్టిన విషయం తెలియజేశానని తెలిపారు. తాకట్టు పెట్టిన బంగారం గురించి అడుగుతుంటే ఇదిగో ఇస్తాం, అదిగో ఇస్తామని రెండు ఏళ్లుగా కాలయాపన చేస్తున్నారని చెప్పారు. పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ జరిగిందని 15 తులాలు ఇప్పిస్తామని మాటిచ్చారని, అయినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని వాపోయారు. అక్కడ కూడా తమకు న్యాయం జరగకపోవడంతో జ్యూయలరీ షాప్ వద్ద ఇలా నిరసనకు దిగానని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ షాపు వద్ద కు చేరి బాధితులకు నచ్చుజెప్పే ప్రయత్నం చేశారు. తర్వాత అక్కడ కి చేరుకున్న టౌన్ సీఐ మురళీధర్‌ను వివరణ కోరగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని చెప్పారు. సాయంత్రం వరకు బాధితులు ఆందోళన చేశారు. అనంతరం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జయబాబు సమక్షంలో రాజీ ప్రయత్నాలు జరిగాయి. కొద్దిరోజుల్లో తమకు ఇవ్వాల్సిన బంగారం ఇప్పిస్తామని పెద్దలు హామీ ఇచ్చారని బాధితుడు విజయ్ విలేకరుల కు చెప్పారు.

షాపు వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

స్వచ్ఛ పార్వతీపురంలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

స్వచ్ఛ పార్వతీపురంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జెసి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, రెవెన్యూ సిబ్బందితో కలిసి జెసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం ఒక్కో నినాదంతో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జరుపుకుంటున్నట్లు చెప్పారు. ఈనెల స్వచ్ఛమైన గాలి అనే నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. స్వచ్ఛమైన గాలి మొక్కల ద్వారానే లభిస్తుందన్న సంగతిని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని, అందుకే ప్రతి ఒక్కరూ తమకు అందుబాటులో ఉన్న ఖాళీ స్థలంలో ఒక మొక్కను నాటాలని కోరారు. వాహన కాలుష్యాన్ని తగ్గించి, స్వచ్ఛమైన గాలి కోసం ప్రజా రవాణా వాహనాలను ఉపయోగించడం, విరివిగా మొక్కలు నాటడం, సోలార్ విద్యుత్ వినియోగం వంటి పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అలాగే పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతిరోజు కొంత సమయం కేటాయించాలని, అది అలవాటుగా చేసుకోవాలని అన్నారు. తద్వారా స్వచ్ఛ పార్వతీపురం రూపుదిద్దుకోగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం అధికారులు, సిబ్బందితో స్వచ్ఛంద్రపై జెసి ప్రతిజ్ఞ చేయించారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని లక్కగూడలో ఎంపిడిఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని పలు వీధుల్లో చీపురు పట్టుకొని శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనం నివసించే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత అని, స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి కనకదుర్గ, సిడిపిఒ విజయ గౌరి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, ఎఎంసి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ కడ్రక కళావతి, మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, దుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతి కుమార్, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు మండంగి భూషణరావు, మండల బిజెపి అధ్యక్షులు కడ్రక అప్పలస్వామి, నిమ్మక భాస్కరరావు, కూటమి నాయకులు చిన్న, దొరబాబు, రాజేష్, కార్తికేయ, ప్రసాద్, గుంజన్న, మన్మథ, పంచాయతీ సెక్రెటరీ రాజేష్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం :ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపిడిఒ ఎంఎస్ఎన్ ప్రసాద్ అన్నారు. మండలంలోని సూరంపేట సచివాలయ పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలను నాటారు. అలాగే మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లోనూ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాంబన్న దొర, పంచాయతీ కార్యదర్శి పి.మురళీకృష్ణ, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని మొండెంఖల్‌లో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పరిసరాలు ప్రజలతో కలిసి పరిశుభ్రపరిచి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ బోడెమ్మ, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : మండలంలోని డోకిశీల పిహెచ్‌సి, గిరిజన సంక్షేమ హాస్టళ్ల జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అందరిచే స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర నోడల్ అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు, డిఐఒ డాక్టర్ విజయమోహన్, వైద్యులు డా. స్నిగ్ధ, సూపర్వైజర్ జయ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.హరగోపాల్ అన్నారు. ఈ మేరకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహన కాలుష్యం తగ్గించాలన్నారు. స్వచ్ఛమైన గాలి కోసం ప్రజా రవాణా వాహనాలు ఉపయోగించాలని, విరివిగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ వెలమల అప్పారావు నాగభూషణరావు, పైల శంకర్రావు తదితరులు ఉన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో స్వర్ణాంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఎపిఒ వెంకట గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలు పరిశుభ్రంగా నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యమన్నారు. కార్యక్రమంలో ఎఒ సునీల్, ఎపిడి శ్రీహరి, జిసిటిఒ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీశ్వరి

మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు పరిహారమివ్వాలి

- చికిత్స పొందిన కుటుంబాలకు రూ.50వేలు ఆర్థిక సాయం అందజేయాలి
- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి -కురుపాం

మండల కేంద్రంలో గల గురుకుల పాఠశాలలో పచ్చకామెర్ల బారినపడి మృతి చెందిన తోయక లావణ్య, తోయక కల్పన కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు ఎం..శ్రీనివాసరావు కె. సీతారాం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు మృతి చెంది, పదులు సంఖ్యలో విద్యార్థులు ఆసుపత్రిపాలై చికిత్స పొందినప్పటికీ ప్రభుత్వంగానీ, అధికారులు గానీ కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. అంతేకాకుండా పాఠశాలలో మౌలిక సదుపాయాలు సక్రమంగా కల్పించకుండా ప్రారంభించమనడం సమంజసం కాదని, కావున మనమంతా ఏకతాటిపైకి వచ్చి మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షలు, చికిత్స పొందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించే వరకూ పోరాడాలని పిలుపునిచ్చారు. అలాగే పాఠశాలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి మెనూ సక్రమంగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకొని, భరోసా ఇస్తేనే విద్యార్థులను పాఠశాలకు పంపిస్తామని లేనిచో పంపించకుండా ఉండడానికి మనమంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం ఉపాధ్యక్షులు తిరుపతిరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెత్తందార్లకు అటవీ భూములు

సాగుచేస్తున్న గిరిజనులకు మొండిచేయి

గిరిజన సంఘం నాయకుల ఆందోళన

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని జమదాల పంచాయతీ పరిధిలో గల పొట్టి గదబవలస, లక్ష్మీపురం, లోవరకండి గ్రామాల గిరిజనులు సాగు చేస్తున్న భూములకు అటవీ అధికారులు పట్టాలు ఇవ్వలేదని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.రామస్వామి, మండల నాయకులు పాలమెట్ట రాము ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక గిరిజనులతో కలిసి గిరిజన సంఘం నాయకులు రామస్వామి, రాము రిజర్వ్ ఫారెస్ట్ భూములను పరిశీలించారు. ఈ గ్రామాల గిరిజనులు అనేక సంవత్సరాలుగా రిజర్వ్ ఫారెస్ట్ భూములను సాగు చేస్తున్నా అధికారులు పట్టాలు ఇవ్వలేదని, కానీ టిడిపికి చెందిన మండల మాజీ అధ్యక్షులు దొగ్గ మోహన్‌కు ఆ భూములు కట్టబెట్టారని ఆరోపించారు. అటవీ శాఖ అధికారులతో కుమ్మక్కై దొగ్గ మోహన్ రిజర్వ్ ఫారెస్ట్ భూముల చుట్టూ కంచె నిర్మించారని చెప్పారు. ఆయనకు సహకరించిన అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గిరిజనులతో కలిసి ఆందోళన చేపడతామని గిరిజన సంఘం నాయకులు రామస్వామి, రాము హెచ్చరించారు.

పెత్తందార్లకు అప్పగించిన భూములను పరిశీలిస్తున్న నాయకులు

మీడియాపై వేధింపులకు ఖండన

ప్రజాశక్తి - సాలూరు

ప్రజా గొంతుకగా వ్యవహరిస్తూ, సామాన్య ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడంలో కీలకంగా పనిచేస్తున్న మీడియా సంస్థలు, వాటి ప్రతినిధులపై ప్రభుత్వం, పోలీసు అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్న తీరును స్థానిక మీడియా ప్రతినిధులు ఖండించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ హైదరాబాద్, విజయవాడలోని సాక్షి కార్యాలయాలపై జరిగిన చర్యలు, ఎడిటోరియల్ ఇన్‌ఛార్జ్ ఆర్. ధనుంజయరెడ్డితో పాటు కల్తీ మద్యంపై కథనాలు రాస్తున్న పలు జిల్లాల బ్యూరో ఇన్‌చార్జీలు, విలేకరులపై కేసులు నమోదు చేయటం, నోటీసులు జారీచేయడం, తనిఖీల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలను యావత్ మీడియా లోకం నిరసిస్తోందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే ఈ తరహా ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదనీ, ఈ చర్యలు మీడియా స్వేచ్ఛకు విఘాతం కలిగించేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండిస్తూ, మీడియా స్వేచ్ఛను పరిరక్షించాలని కోరారు. అనంతరం తహశీల్దారు నకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ నాయకులు బి.విశ్వేశ్వరరావు, కూర్మారావు, చంద్ర మౌళి, నల్లి శ్రీను, అల్లు కృష్ణ పాల్గొన్నారు.

ఇంతకీ ఎంత?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇంతకీ ఎంత? వచ్చిందెంత? ఇచ్చిందెంత? మిగిలిందెంత? ఇదీ ఉత్సవాల పేరిట నిధుల సమీకరణ, ఖర్చు జమలపై ఉమ్మడి విజయనగరం జిల్లాలో సర్వత్రా సాగుతున్న పబ్లిక్ టాక్. ఈ నెల 5, 6వ తేదీల్లో విజయనగరం ఉత్సవాలు జరిగాయి. ఘనంగా నిర్వహించామంటూ అధికారులు, అధికార పార్టీ నేతలు చెప్పుకుంటుంటే, ఈసారి ఉత్సవాల నిర్వహణ అధ్వానంగా ఉందంటూ ప్రధాన ప్రతిపక్షం వైసిపి నుంచి విమర్శలు వినిపించాయి. నిర్వహణలో లోటుపాట్లు, వైఫల్యాల సంగతి అటుంచితే... ఉత్సవాల్లో జనం ఎప్పటి మాదిరిగానే భాగస్వామ్యం అయ్యారనేది వాస్తవమే. అంతమాత్రాన చంకలు గుద్దుకోవడానికి వీల్లేదు సుమా...! కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం తదితరాలపై ప్రజలకున్న మక్కువ అది. అందుకే ఎన్ని లోటుపాట్లు ఉన్నా జనం ఉత్సవాల్లో భాగస్వామ్యమౌతూ వస్తున్నారు. ముఖ్యంగా కళాకారులకు ప్రోత్సాహకాలు ఇచ్చినా, ఇవ్వకపోయినా ప్రదర్శనలకు పోటీ పడుతుంటారు. దీన్ని ఆసరాగా చేసుకుని, ఉత్తి పుణ్యానికి ప్రదర్శన అవకాశాలు కల్పించిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. ఇటువంటి వైఫల్యాలు నిరంతరం సాగుతున్నవే. కానీ, ఈసారి ఉత్సవ నిధుల సేకరణ సంప్రదాయానికి మించిన రీతిలో సాగినట్టుగా విమర్శలు ఉన్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. గతంలో పరిమితమైన వారి నుంచి నిధులు సేకరించేవారు. ఈసారి కాస్త ఎక్కువ మంది నుంచి సేకరించారని బోగట్టా. దీనికితోడు అధికారులు దాతలను కలిస్తే... ఆ దాతలు వారి దిగువున్న ఉన్నవారిపై పడ్డారట. దీంతో, కింది స్థాయి వరకు వెళ్లిపోయింది. ఇటువంటి పరిస్థితి మునుపెన్నడూ లేదనే వాదన వినిపిస్తోంది. ఉత్సవాల పేరిట దండేసుకున్నారంటూ వైసిపి నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మరింత సూటిగా విమర్శలు చేశారు. ఆ తరువాత రోజే జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఉన్నంతలో వచ్చిన నిధులపై కొంత క్లారిటీ ఇచ్చారు. కానీ, అది ప్రాథమిక అంచనా మాత్రమే. దీనిపై ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదు. వాస్తవానికి ఈ నిధులు సేకరించింది అధికారులే. లెక్కలన్నీ వారి వద్దే ఉన్నాయి. వివిధ వేదికలు, ఇతర ఖర్చులకు కేటాయించిన ఖర్చులు కూడా వారే చూసుకున్నారు. మునుపెన్నడూ లేనంతగా విమర్శలు వస్తున్నప్పటికీ ఇప్పటికీ నిర్దిష్టమైన లెక్కలు చూపించక పోవడంతో పారదర్శకతపై అనుమానాలు, విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉత్సవాలు ముగిసి పది రోజులు దాటుతున్నా ఇప్పటికీ అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోందనే చర్చ ముమ్మరంగా సాగుతోంది. ఒక్క లేజర్ షోకి రూ.20 లక్షలు వెచ్చించారట! అంటూ జనం ముక్కున వేలేసుకుంటున్నారు. రాజుల రాజసం తెలియజేయడానికి ఇంత మొత్తంలో ఖర్చా? అంటూ చర్చ నడుస్తోంది. అందుకే ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి మొత్తం ఎంత ఖర్చయింది? ఎవరి నుంచి ఎంత విరాళం అందింది? ఆ నిధులు ఎలా వినియోగించారు? మిగిలిన మొత్తం ఎంత? అనేది స్పష్టం చేస్తుందా? లేదా? అనే ఆసక్తికర పబ్లిక్ టాక్ ఉమ్మడి విజయనగరం జిల్లాలో నడుస్తోంది.

సమావేశంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ కనకదుర్గ

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా డైరెక్టర్ కనకదుర్గ అన్నారు. మండలంలోని భద్రగిరి బాలికల గురుకుల పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని, బాలురుతో సమానంగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. మహిళల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాలు, గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్, చైల్డ్ లేబర్, చైల్డ్ ట్రాఫికింగ్, ఫోక్సో చట్టం గురించి క్లుప్తంగా వివరించారు. ఆటలు పోటీల్లో విజేతలగా నిలిచినటువంటి విద్యార్థులు బహుమతులు ప్రధానం చేశారు. భద్రగిరి సిడిపిఒ విజయగౌరి, టీచర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

104 వాహనంలో తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

104 వాహనాన్ని పరిశీలిస్తున్న మేనేజర్

104 వాహనంలో ఉన్న వైద్య సేవలు ప్రజలు వినియోగించుకోవాలని 104 జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ అన్నారు. మండలంలోని పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల 104 వాహనాన్ని శనివారం ఆకస్మాత్తుగా తనిఖీ చేసి, ఎక్విప్మెంట్ పనితీరు మందుల లభ్యతను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వాహనంలో ఉండే వైద్య సదుపాయాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు ఎటువంటి మందుల కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అలాగే వాహనాల కండిషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి, ఏదైనా మేజర్ సమస్యలుంటే తన దృష్టికి తీసుకువచ్చినట్లైయితే, వెంటనే అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేస్తానని తెలిపారు. వాహనంలో అన్ని రికార్డులు, మందుల లభ్యత పరిశీలించారు. వాహనాన్ని తనిఖీ చేసి పరిస్థితిని పరిశీలించి, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 104 సిబ్బంది ఉన్నారు.

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని మన్యం జిల్లా బిసి సంఘం అధ్యక్షులు ఆవాల రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఖడ్గవలస జంక్షన్ వద్ద బిసి నాయకులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ లోని అన్ని బిసి సంఘాలు రాష్ట్ర వ్యాప్త తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చిన సందర్భంగా సంఘీభావంగా ఆంధ్రప్రదేశ్‌లోని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యాప్తంగా తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా నిరసన తెలిపామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు, బిసిలు పాల్గొన్నారు.

ఒఆర్ఎస్‌పై శిక్షణ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఒఆర్ఎస్‌పై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ రిసోర్స్ పర్సన్ కాంతి కుమార్ మనోహర్ పంచాయతీ ఆదాయ వనరులు సేకరణ వివరించారు. పంచాయతీలో 406 రకాల నుండి ఆదాయ వనరులు సేకరించొచ్చని అన్నారు. వీటిపై పంచాయతీ అభివృద్ధి ఆధారపడి ఉన్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎస్ఎన్.ప్రసాద్, ఎఒ వెంకటరావు, వివిధ వివిధ గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెదబుడ్డిడికి బస్సు సౌకర్యం పునరుద్ధరించండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తమ గ్రామానికి బస్సు సౌకర్యం పునరుద్ధరించండి అంటూ జియ్యమ్మవలస మండలం పెదబుడ్డిడి గ్రామ పెద్దలు ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మణరావుకు వినతిపత్రం సమర్పించారు. శనివారం నేరుగా పార్వతీపురం డిపో మేనేజర్‌ను కలిశారు. గతంలో తమ గ్రామానికి బస్సు సౌకర్యం ఉండేదని, ఆ తర్వాత చిన్న చిన్న కారణాలు చూపించి ఆపివేయడం అన్యాయమని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు(స్త్రీ శక్తి)సదుపాయం కల్పిస్తుంటే బస్సు సౌకర్యం లేనందున పెద్దబుడ్డిడి, రావివలస, లఖానాపురం, తురక నాయుడు వలస గ్రామాల మహిళలకు ఆ పథకం వర్తించకుండానే పోతుందన్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు మధ్యలోనే చదువులను ఆపేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇకనైనా తమ గ్రామాల మీద బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్‌ను వారు కోరారు. దీనిపై చర్చించి త్వరలో న్యాయం జరిగేలా చూస్తానని డిపో మేనేజర్ లక్ష్మణరావు చెప్పడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెద బుడ్డిడి గ్రామ మాజీ ఎంపీటీసీ సీమల బాబుభువన మోహనరావు, గ్రామ ఉపసర్పంచ్ రేవల్ల తిరుపతిరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు తమ సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న సమ్మె పరిష్కరించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యాధులు ప్రబలే సమయంలో వైద్యులు సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని రంజిత్ కుమార్ అన్నారు. వైద్యుల న్యాయమైన డిమాండ్లు తీర్చాలని కోరారు. రోగాల బారినపడి ప్రజలు, విద్యార్థులు మృత్యువాత పడుతున్నారని, ఆసుపత్రుల్లో బెడ్లు కూడా ఖాళీ లేని స్థాయిలో ప్రజలు రోగాల బారినపడి ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. తక్షణమే వైద్యుల న్యాయమైన డిమాండ్లు తీర్చి సమ్మె విరమించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం కొమరాడ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని గల పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేసినట్టు ఐసిడిఎస్ పిఒ గొట్టాపు సుగుణకుమారి తెలిపారు. రక్తహీనత లేకుండా ఉండేలా బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. డిసిపిఒ అల్లు సత్యనారాయణ బాలికల చట్టాలు, హక్కులు తదితర అంశాలపై వివరించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలల సంరక్షణ జిల్లా కౌన్సిలర్ జి.తవిటినాయుడు మాట్లాడుతూ బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, మనోధైర్యం తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రజినీకుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రౌతు లక్ష్మి, అంగన్వాడీ వర్కర్లు పల్ల కృష్ణవేణి మహంతి, పద్మావతి, మూడడ్ల స్వాతి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిడిపిఒ సుగుణకుమారి

అరకు పార్లమెంటు అధ్యక్ష రేసులో తేజోవతి

- టిడిపి అధిష్టానం నుంచి కేడర్‌కి ఐవిఆర్ కాల్స్
- ముందంజలో ఎస్‌టి మహిళా నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం

అధికార పార్టీ అరకు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్ష పదవి రేసులోకి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.తేజోవతి వచ్చారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి పార్లమెంట్ పరిధిలో గల అన్ని నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలకు ఐవిఆర్ కాల్స్ వచ్చాయి. ముగ్గురు నాయకుల పేర్లు సూచిస్తూ వారిలో ఒకరిని ఎంపిక చేయాలని రాష్ట్ర కార్యాలయం నుంచి ఐవిఆర్ కాల్స్ అందాయి. అరకు పార్లమెంటు పార్టీ అధ్యక్షుడిగా ప్రస్తుతం కిడారి శ్రవణ్ కుమార్ ఉన్నారు. కిడారి శ్రావణ్ కుమార్ యువకుడు, విద్యావంతుడైనప్పటికీ పార్టీలో ఉన్న సీనియర్ నాయకులు, కార్యకర్తలను సరిగ్గా నియంత్రించలేకపోయారనే వాదనలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఆయన ప్రభుత్వ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న కారణంగా ఆయన్ను తప్పించాలనే యోచనలో పార్టీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. తేజోవతి ఉన్నత విద్యావంతురాలే కాకుండా గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

ఉత్తరాంధ్రాకు చెందిన కీలక నేతల అండదండలు ఆమెకు పుష్కలంగా ఉన్నాయి. గత ఎన్నికల ముందు సాలూరు అసెంబ్లీ సీటు ఆశించి ఆమె క్రియాశీల రాజకీయాల్లో అరంగ్రేటం చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారు. అయితే స్థానికత కారణంగా ఆమెకు టికెట్ దక్కలేదు. అప్పటి నుంచి పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఇటీవల ఆమెకు గిరిజన సలహా మండలి సభ్యురాలిగా ప్రభుత్వం నియమించింది. వీరే కాక పాలకొండ నియోజకవర్గానికి చెందిన మరో గిరిజన నాయకుడు ప్రసాద్ పేరు కూడా అధిష్టానం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అరుకు పార్ల మెంటు నియోజక వర్గం ఎస్టీలకు రిజర్వ్ చేసినందున పార్టీ నాయకత్వ పగ్గాలు వారికే కేటాయించాలని అధిష్టానం భావి స్తోంది. ఈ నేపథ్యంలో పార్టీ నాయకత్వం ఆమె పేరును పార్లమెంటు పార్టీ అధ్యక్ష పదవికి పరిశీలిస్తోంది. ఎస్టీ మహిళా కోటాలో ఆమెకు ఈ పదవి దక్కవచ్చుననే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోని 25 పార్లమెంటు నియోజక వర్గాల్లో ఎస్టీ మహిళలకు అరుకు పార్లమెంటు నియోజకవర్గ నాయకత్వ బాధ్యతలు అప్పగించను న్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

బిసి నాయకుల ఆశలపై నీళ్లు

అరుకు పార్లమెంటు నియోజకవర్గాన్ని రెండు జిల్లాలుగా విభజించి వేర్వేరు కార్యవర్గాలను నియమించాలని కోరిన మన్యం జిల్లా బిసి నాయకుల ఆశలపై అధిష్టానం నీళ్ళు చల్లింది. రాష్ట్రంలోనే విస్తీర్ణం దృష్ట్యా అరుకు పార్లమెంటు నియోజకవర్గం పెద్దది కావడంతో రెండు జిల్లాల కమిటీలు ప్రకటించాలని స్థానిక జిల్లా బిసి నాయకులు డిమాండ్ చేశారు. కొద్ది నెలల క్రితం విశాఖపట్నంలో నిర్వహించిన అరుకు పార్లమెంటు నియోజకవర్గ సమావేశంలో పార్టీ పరిశీలకులు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నాయకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా నాయకత్వ బాధ్యతలు బిసిలకు అప్పగించాలని కొంత మంది బిసి నాయకులు పరిశీలకుల దృష్టికి తీసుకెళ్లారు. పాడేరు జిల్లా కమిటీ బాధ్యతలను ఎస్టీలకు అప్పగించి, మన్యం జిల్లా కమిటీ కి బిసి నాయకుడిని ఎంపిక చేయాలని కోరారు. మన్యం జిల్లాలో జనాభా లెక్కల ప్రకారం బిసిలే అధికంగా వున్న నేపథ్యంలో వారికే పార్టీ పగ్గాలు ఇవ్వాలని కోరారు. అయితే అధిష్టానం వారి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న దాఖలాల్లేవు.

కార్మికుల పిఎఫ్ సొమ్మును మింగేసిన యాజమాన్యాలపై పోరాడాలి : సిఐటియు

ప్రజాశక్తి - సీతానగరం

జిల్లాలో సుగర్, జ్యూట్, ఆర్‌టిసి కార్మికుల శ్రమతో దాచుకున్న పిఎఫ్ సొమ్మును కట్టకుండా మింగేసిన యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్న మోడీపైనా, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై పోరాడాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు, ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా మండలంలో జ్యూట్, సుగర్ ఫ్యాక్టరీల్లో, ఆర్టీసీల్లో పనిచేసే పిఎఫ్ చెల్లిస్తున్న కార్మికులు వేలాదిమంది ఉన్నారన్నారు. వీరి సొమ్మును జ్యూట్ మిల్, సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు పిఎఫ్ సంస్థకు చెల్లించకుండా వారి రిటైర్మెంట్ తర్వాత దాచుకున్న సొమ్ము రాకుండా ఇపిఎఫ్ పెన్షన్ లేకుండా చేయడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వాలు చర్య తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగులు పోరాడి సాధించుకున్న 1952 భవిష్య నిధి చట్టంలో 20 కోట్ల మంది. లక్షల కోట్ల రూపాయలు దాచుకుంటే, వారి సొమ్మును యజమానులు చెల్లించకుండా దాచుకోవడం, షేర్ మార్కెట్లో పెట్టి ప్రభుత్వాలు మింగేస్తున్నాయని విమర్శించారు. మోడీ ప్రభుత్వం 2014 ఎన్నికల్లో రూ.9వేలు పెన్షన్ ఇస్తానని కార్మికులకు హామీ ఇచ్చిందని, దీని అమలు కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఇపిఎఫ్ పెన్షన్ నెలకు రూ. 9వేలు ఇవ్వాలని, షేర్ మార్కెట్లో కార్మికుల సొమ్ము పెట్టవద్దని కోరుతూ నవంబర్ మొదటి వారంలో సీతానగరం, పార్వతీపురం, సాలూరు తహశీల్దార్ కార్యాయాల వద్ద ధర్నాలు చేయాలని, పిఎఫ్, పెన్షనర్ల సంఘం డిసెంబర్ 8, 9న తలపెట్టిన చలో ఢిల్లీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, ఆర్.రాము పాల్గొన్నారు.

ఒక్కపూటే ఉపాధి పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - బలిజిపేట

ఉపాధి హామీ పనులు ఒక్క పూటే పెట్టాలని, ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ. 600 కూలి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ పీసా వెంకటస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం మండల కార్యదర్శి వెన్నెల వేణు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సమస్యలపై ఈనెల 22న పార్వతీపురంలో జరుగు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సంఘం మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా పీసా వెంకటస్వామి, కార్యదర్శిగా వెన్నెల వేణు, ఉపాధ్యక్షులుగా నల్ల ఈశ్వరరావు, అప్పలస్వామి, నారాయణ, సోములు, మరో ముగ్గుర్ని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ వేణు, మండల నాయకులు వై.మన్మధరావు, బొద్దాన భానుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిలబడి నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతూ మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలు ఆరో రోజైన శనివారం కొనసాగాయి. ఈ సందర్భంగా శనివారం "ఒంటికాలి"పై నిలబడి గిరిజన, వామపక్ష ప్రజాసంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి కుమార్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు పి.సంగం మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ విద్యా సంస్థల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించే వరకు పోరాటం చేస్తామని, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గహాల్లో ఎఎన్ఎమ్ లను నియమించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాని సభలో ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తికి పరిహారం ఇచ్చిన అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థులు మృతి చెందినా పరిహారం ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. అంతరిక్షంలో మనుషులు వెళ్లి బతుకుతున్న ఈ రోజుల్లో ఇప్పటికీ గిరిజన ప్రజలు, విద్యార్థులు సురక్షిత తాగునీరు నీరు, పౌష్టికాహారం, మెరుగైన వైద్యం లేక చనిపోవడమేమిటని ప్రశ్నించారు. ఇది పాలకుల నిర్లక్ష్యం కాదా అని ధ్వజమెత్తారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, విద్యా శాఖ మంత్రి బాధ్యత లేకుండా ఉన్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధితులకు సాయం చేసినా అధికారంలో ఉన్న వారు కనీసం జాలి చూపడం లేదని అన్నారు. దీక్షలో గౌరీశ్వరీ,రమణమ్మ, చంద్ర కళ, నక్షత్ర, రాజేశ్వరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మద్దాలవారి వీధిలో సర్వే

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

మున్సిపల్ మాస్టర్‌ప్లాన్‌లో 60 అడుగుల రోడ్ల నుంచి మద్దాలవారివీధిని (బొగ్గులవీధి) మినహాయింపుపై మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ విభాగం, ధారాస ఏజెన్సీస్ బృందం శనివారం సర్వే చేపట్టింది. మున్సిపల్ మాస్టర్‌ప్లాన్‌లో 60 అడుగుల రోడ్ల నుంచి మినహాయింపు ఇవ్వాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, ఆ వీధి ప్రజలు ఇటీవల మున్సిపల్ కార్యాలయం, జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆందోళన తెలిపి వినతులు అందజేశారు. ఈ నేపథ్యంలో పునః పరిశీలన కోసం మద్దాలవారి వీధిలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ వెంకటనారాయణ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రతి 20ఏళ్లకొకసారి ప్రజల అవసరాల నిమిత్తం మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఇతరాలు ప్రతిపాదనలు తయారు చేసి బుడా అనుమతులకు పంపనున్నట్టు తెలిపారు. 2018లో ప్రతిపాదనలు అమలు కోసం ఇటీవల పలు ప్రాంతాల్లో పబ్లికేషన్ చేయడం జరిగిందని, పాకల సన్యాసిరావు, గొర్లి వెంకటరమణ, ఆ వీధి ప్రజలు మాస్టర్ ప్లాన్ రోడ్డు వల్ల తమ ఇళ్లకు, స్థలాలకు నష్టం వస్తుందని, అభివృద్ధి ప్రక్రియ జరిగినచో తమ వీధి భౌగోళికస్థితి మారుతుందని అభ్యంతరాలను కమిషనర్‌కు, కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా తెలిపారన్నారు. బుడా చైర్మన్, పిఒ ఆదేశాల మేరకు రీసర్వే చేసి లోపలు గుర్తించి ప్రతిపాదనలు పంపుతామన్నారు.

సంతకాలను సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

ఉచిత వైద్యం.. ప్రజల హక్కు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రజలకు ప్రభుత్వం ఉచిత వైద్యం అంందించాలని, అది వారి హక్కు అని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగరావు అన్నారు. మండలంలోని సంగంవలసలో కోటి సంతకాల సేకరణ జరిగింది. ఈ కార్యక్రమంలో జోగారావు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం కార్యక్రమానికి పిలుపు పార్టీ పిలుపునిచ్చిందన్నారు. అందులో భాగంగానే నియోజకవర్గంలో గత రెండు వారాలుగా వివిధ గ్రామ పంచాయతీలో, వార్డులలో రచ్చబండ కార్యక్రమాన్ని చేపట్టి ప్రజల మద్దతు కోరుతూ సంతకాల సేకరణ చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, వైఎస్ ఎంపిపిలు సిద్దా జగన్నాథం, బి రవికుమార్, జెడ్‌పిటిసి ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, స్థానిక సర్పంచ్ బడే శ్రీరంజన్, ఎంపిటిసి సోములమ్మ, మాజీ ఎంపీటీసీ కోడి వెంకట నాయుడు, సీనియర్ నాయకులు, డాక్టర్ సెల్ అధ్యక్షులు బడే సత్యన్నారాయణ, సోషల్ మీడియా విభాగం అధ్యక్షులు వెంకటరమణ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు, స్థానిక ప్రజలు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ :మెడికల్ కళాశాల ప్రైవేటు వ్యతిరేకంగా శనివారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గర కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని ప్రైవేటీకరించడం అన్యాయమని, దీన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నాం న్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కళావతి, వైస్ ఎంపిపి కణపాక సూర్యప్రకాష్ వైసిపి అధికార ప్రతినిధి నెల్లి శివప్రసాద్ రణస్థలంరాంబాబు కోట విజయ్ గురువినాయుడు బలగ మన్మధరావు తదితరులు ఉన్నారు.

పిహెచ్‌సి వద్ద నిరసన తెలుపుతున్న సిహెచ్‌డబ్ల్యులు

సిహెచ్‌డబ్ల్యుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఆరోగ్యశాఖలో గ్రామాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కమ్యూనిటీ హెల్త్‌వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన తెలిపారు. అనంతరం హెచ్‌వి శారదకు వినతిని అందజేశారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ ప్రతిరోజు గ్రామ గ్రామాన తిరుగుతూ పేద ప్రజలకు వైద్యసేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు అనారోగ్యంతో మరణించిన వారికి నేటికీ దహన సంస్కార ఖర్చులు ఇవ్వడంలేదని అన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం చెల్లించాలని, ఉపాధి పని కల్పించాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని, అర్హులైన వారికి ఆశ వర్కర్లుగానూ, ఎఎన్ఎంగా నియమించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనరూ, 26వేలు చెల్లించాలని, అన్నిరకాల సెలవులు, జాతీయ, పండగ, వారంతపు సెలవులు, క్యాజవల్, మెడికల్ లీవ్ లు ఇవ్వాలనీ కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి అన్ని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు రేణుక, జయంతి, భారతి, కుసుమలక్ష్మి, సంతోషి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేని సరుకులు పంపిణీ చేస్తే చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఆశ్రమ పాఠశాలలకు నాణ్యమైన గుడ్లు, నిత్యవసర సరుకులు అందేలా చూడాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు ఎటిడబ్ల్యూఒ రజిని సూచించారు. నాణ్యత లేని గుడ్లు.. విద్యార్థులకు రావా రోగాలు అన్న ప్రజాశక్తిలో శనివారం ప్రచురితమైన వార్తకు జిల్లా అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా అధికార బృందం మండలంలోని దుడ్డుఖల్లు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను శనివారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహం ఉన్న గుడ్లు, నిత్యవసర వస్తువులను పరిశీలించారు. ఆశ్రమ పాఠశాలలకు పంపిణీ చేసే గుడ్లు, పాలు, చెక్కీలు తదితర వస్తువులు నాణ్యతా ప్రమాణాలతో ఉండాలని, విద్యార్థుల ఆరోగ్య రక్షణ చూడాలని అన్నారు. నాణ్యతలేని సరుకులు పంపిణీ చేస్తే సంబంధిత వార్డెన్లు ముందుగా తెలియజేయాలని అన్నారు. నాణ్యతలేని వస్తువులు సరఫరా చేసినట్లయితే టెండర్ల రద్దు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్య పట్ల ప్రభుత్వం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిసిసి మేనేజర్ రాము , పాఠశాల సిబ్బంది ఉన్నారు.



దుడ్డుఖల్లు ఆశ్రమ పాఠశాలలో గుడ్లు పరిశీలిస్తున్న ఎటిడబ్ల్యూఒ

ఇఓపిఆర్‌డికి వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

పెద్దింపేటలో తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెద్దింపేటలో తాగడానికి మంచి నీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారని, వీరికి మంచినీరు అందజేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలో ఇంటింటికి సంతకాల సేకరించిన అనంతరం శనివారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి, ప్రజల నుంచి సంతకాలతో ఇఓపిఆర్‌డికి వినతిని అందజేశారు. అనంతరం రెడ్డి వేణు, పెద్దింపేట గ్రామ సిపిఎం శాఖ కార్యదర్శి వెన్నెల గోపాల్ మాట్లాడుతూ రక్షిత మంచినీరు లేక గ్రామస్తులు కలుషిత నీరు తాగుతూ అనారోగ్యాలకు గురౌతున్నారన్నారు. ఊరుకు దూరంగా పామాయిల్ తోటలో ఉన్న రైతు బోరు నుంచి నీరు తెచ్చుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. అయితే ఇప్పుడు ఆ రైతు నీటికి రానీయడం లేదన్నారు. పెద్దింపేటలో గల ఎనిమిది చేతి పంపు బోర్ల నుంచి నీరు తాగడానికి పనికిరాదని, వీటి నుంచి కలుషితం, ఉప్పు నీరు వస్తుందని తెలిపారు. గతంలో రక్షిత మంచినీరుకోసం ప్రభుత్వం ప్రతిపాదించిన, నిధులు వచ్చిన, వీటిని దుర్వినియోగం చేశారన్నారు. గౌరీపురం, సువర్ణముఖి నది నుంచి పెద్దింపేట వరకు పైపులైను వేసి విడిచి పెట్టారు తప్ప మంచినీళ్ల ట్యాంకు కట్టలేదన్నారు. పెద్దింపేటలో ఇంటింటి కుళాయిలు [illegible] వేశారన్నారు. పంచాయతీ ఆఫీస్ దగ్గర బోరు నుంచి నీరు తాగడానికి పనికిరాదని, కావున తక్షణమే ప్రభుత్వం నిధులు ఇచ్చి మంచిగా తాగేనీరు వచ్చిన చోటబోరు వేసి, ట్యాంకు కట్టి ప్రభుత్వం మంచినీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పది రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. పరిష్కారం కానిచో కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యమ్మల మన్మధరావు, గేదెల సత్యనారాయణ, వెంకటస్వామి, నల్ల ఈశ్వరరావు, భానుమూర్తి, దుర్గారావు, గౌరీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

పనుల గుర్తింపుపై అవగాహన

ప్రజాశక్తి -బలిజిపేట

ఉపాధి హామీ చట్టం ద్వారా 2026 - 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులు గుర్తింపునకు సామాజిక పటాల ద్వారా ముందుగా అవగాహన కల్పించి, తద్వారా మండలానికి కావాల్సిన రూ.58 కోట్లు పనులను గుర్తించాలని ఎంపిడిఒ ఆర్.శ్రీవాణి సూచించారు. మండలంలోని పలగర, చిలకలపల్లి, వెంగళరాయపురంలో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించి ముందుగా గ్రామసభల్లో ప్రజలకు అవగాహన కల్పించి గ్రామ పంచాయతీకి సంబంధించిన లేబర్ బడ్జెట్‌కు పనులను గుర్తించాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వెంగాపురం ఎంపిటిసి సభ్యులు గులిపల్లి మురళి, ఎపిఒ కేశవరావు, సెక్రెటరీ వెంకటనాయుడు, టిఎ, సర్వే పవణు, గ్రామపెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కురుపాం

మృతి చెందిన గౌరునాయుడు

కర్రల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన విషాధ సంఘటన శనివారం రాత్రి మండలంలోని చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం.. కురుపాం మండలం పూతికవలసకు చెందిన గొట్టాపు గౌరునాయుడు (55) ద్విచక్ర వాహనంతో కురుపాం వెళ్లి స్వగ్రామానికి వెళ్తూండగా కాటందొరవలస సమీపంలో కర్రల లోడ్తో వెళ్తున్న ట్రాక్టర్ను బలంగా ఢీకొట్టాడు. తలకు తీవ్రంగా గాయం కావడంతో రహదారి వెంబడి వెళ్లే స్థానికులు గమనించి, ప్రమాదం గురించి 108 వాహనానికి సమాచారం అందించగా ఎంత సేపటికి రాకపోవడంతో గ్రామస్థులే ఆటోలో క్షతగ్రాతుడిన్ని సిహెచ్‌సికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అందుబాటులో 108 వాహనం లేకపోవడంతో గంటకు పైగా మృత్యువుతో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయాడు. గౌరునాయుడుకి భార్య, ఇద్దరూ పిల్లలు ఉన్నారు. స్థానిక ఎస్సై పి.నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కురుపాం సమీపంలో గల కాటందొర వలస ప్రధాన రహదారి వద్ద జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం పూతికవలస గ్రామానికి చెందిన గొట్టాపు గౌరు నాయుడు ద్విచక్ర వాహనంతో వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయన్ను స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం తరలిస్తున్నారు.

గంజాయి రవాణా చేసే వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి -కొమరాడ

ఒడిస్సా నుంచి ఆంధ్ర రాష్ట్రంలోకి గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తికి రిమాండ్ విధించినట్లు స్థానిక ఎస్సై నీలకంఠం తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 10న కూనేరు చెక్పోస్ట్ వద్ద వాహన తనిఖీల్లో గంజాయితో పట్టుబడిన ఇద్దరు ముద్దాలపై కేసు నమోదు చేశామని తెలిపారు. విచారణలో భాగంగా ఒడిస్సాలోని కంద మాల్ జిల్లా బాలిగృహ బ్లాక్ తంగేరికి చెందిన దిలీప్ మల్లిక్ (34)ను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం పార్వతీపురం జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించడం జరిగిందని తెలిపారు.

ప్రధాన రహదారి మలుపు వద్ద లారీ బోల్తా

ప్రజాశక్తి -భామిని

మండలంలోని పసుపుడి ప్రధాన రహదారి మలుపు వద్ద లోడుతో వరుసగా వస్తున్న నాలుగు లారీల్లో ఒక లారీ శుక్రవారం రాత్రి బోల్తా పడింది. ఈ లారీలు విశాఖపట్నం నుంచి చత్తీస్గడ్ పవర్ ప్లాంట్‌కు పత్తర్ తరలిస్తున్నట్లు సహచర లారీ డ్రైవర్లు తెలిపారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోవడంతో తోటి లారీ డ్రైవర్లు ఊపిరి పీల్చుకున్నారు.



పెద్దదిమిలిలో నిల్వ ఉన్న ఇసుక

పెద్దదిమిలి సమీపాన అక్రమ ఇసుక నిల్వలు

భామిని మండలంలోని పెద్దదిమిలి సమీపాన ఎటువంటి భవన నిర్మాణాలు లేని ప్రాంతంలో కొండకు సమీపాన అక్రమంగా ఇసుక నిల్వ వేసి ఉన్నాయి. ఎటువంటి భవన నిర్మాణాల్లేని ప్రాంతంలో టన్నుల కొద్దీ అక్రమంగా ఇసుక నిల్వచేసి ఉండటంపై సర్వత్రా అనుమానాలు రేకెత్తుతున్నాయి. కొందరు ట్రాక్టర్‌తో ఇసుక రవాణా చేసి, నిల్వచేసి, తరలించి లాభాసాటి వ్యాపారంగా మార్చుకుంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.